నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, బుధవారం 11 సెప్టెంబర్ 2024 YADADRI BHUVANAGIRI

ఎస్సీ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు 12న స్పాట్ కౌన్సెలింగ్

నల్లగొండ/భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 10 : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఐదు నుంచి తొమ్మిదో తరగతి వరకు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 12న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆర్సీఓ విద్యారాణి, డీసీఓ జగదీశ్వర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు సంబంధించి సూర్యాపేట జిల్లాలోని దురాజ్‌పల్లి రోడ్డులో ఉన్న ఇమాంపేట ఎస్సీ గురుకుల విద్యాలయంలో, యాదాద్రి, జనగాం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు సంబంధించి భువనగిరి సీఓఈ బాలుర కళాశాలలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులు, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆయా పాఠశాలల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుల ఆధారంగా మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ఖాళీలు, అర్హతను బట్టి సీట్ల భర్తీ నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు బోనఫైడ్‌తో హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు ఇమాంపేట-9704550271, భువనగిరి-99493 56343 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.



అనంతారం పాఠశాల విద్యార్థులతో ముచ్చటిస్తున్న 16వ ఆర్థిక సంఘం సభ్యులు అజయ్ నారాయణ ఝా, మనోజ్ పాండా, రాష్ట్ర స్థాయి అధికారులు క్రిస్టినా చోంగ్తు, అనితా రామచంద్రన్, కలెక్టర్ హనుంతు కె.జెండగే

'నీటి పారుదల'పై ఉత్త మాటలే..

కాంగ్రెస్ ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప.. ఏమీ ఒరగలే..

- ఇటీవల భువనగిరిలో నీటి పారుదల శాఖపై సమీక్ష
- ఇద్దరు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్సీ, ఏడుగురు ఎమ్మెల్యేలతో హడావుడి
- పైసా విదిల్చలే.. పరిపాలన అనుమతులు ఇవ్వలే..
- బస్వాపూర్ ప్రాజెక్ట్ ఊసేలేదు.. పట్టించుకునే నాథుడే లేరు
- పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి, బునాదిగాని కాల్వలకు నిధుల మంజూరేది..?
- గంధమల్ల రిజర్వాయర్‌కు అనుమతులే ఇయ్యలే..!

ఇద్దరు రాష్ట్ర కీలక మంత్రులు, ప్రభుత్వ విప్, ఎంపీ, ఎమ్మెల్సీ, మరో ఆరుగురు ఎమ్మెల్యేలు. అంతా అప్పడే ఏదో జరిగిపోయినట్లు హడావుడి.. రిజర్వాయర్లు, కాల్వలు కట్టినంత డ్రామా.. ఇదీ భువనగిరి పార్లమెంట్ స్థాయి సమీక్ష. కానీ ఒక్క పైసా విడుదల చేయలేదు. ఒక్క జీవో రిలీజ్ కాలేదు. పరిపాలనా అనుమతులు కూడా పత్తాలేవు. అన్నీ ఉత్తుత్తి ముచ్చట్లు.. నోటి మాటలు, ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప ఒరిగిందేమీ లేదు. సమీక్ష జరిగి పది రోజులైనా ఉలుకూ పలుకూ లేకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ)

నీటి పారుదల పురోగతి పనులపై ఆగస్టు 30న భువనగిరిలో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి ఉత్తమ్, ఎంపీ చామల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యేలు కుంభం, రాజగోపాల్ రెడ్డి, సామేల్, వీరేశం తదితరులు (ఫైల్)

భువనగిరి పార్లమెంట్ పరిధిలోని నీటిపారుదల పురోగతి పనులపై ఆగస్టు 30న భువనగిరిలో సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లో కాన్ఫరెన్స్ హాల్, హెలిప్యాడ్ ఉన్నప్పటికీ వృథా ఖర్చుతో న్యూడైమెన్షన్ స్కూల్‌లో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. దీనికి రాష్ట్ర మంత్రులు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మందుల సామేల్, వేముల వీరేశం, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. వీరితోపాటు రైతులు, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు. పార్లమెంట్ పరిధిలో నీటిపారుదల శాఖ పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కూడా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు తమ పరిధిలోని సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్లతోపాటు బునాదిగాని, ధర్మారెడ్డి పల్లి, పిలాయిపల్లి కాల్వల గురించి ప్రస్తావించారు. నీటిపారుదల శాఖ అధికారులు కూడా ఆయా ప్రాజెక్ట్‌లపై ప్రతిపాదనలు పంపించారు. కానీ ఏ ఒక్కటీ అడుగు ముందుకు పడలేదు. అందరి నమ్మకాలన్నీ వమ్ము అయ్యాయి.

కాళేశ్వరం -16వ ప్యాకేజీలో భాగంగా 11.39 టీఎంసీలతో బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మించారు. దీనిలో భాగంగా భువనగిరి మండలంలో తిమ్మాపూర్, యాదగిరిగుట్ట మండలంలోని లప్పానాయక్ తండా ముంపునకు గురవుతున్నాయి. భువనగిరిలో జరిగే సమీక్షకు ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలియడంతో బస్వాపూర్ రిజర్వాయర్‌కు డబ్బులు వస్తాయని అంతా భావించారు. చివరి దశలో ఉన్న ప్రాజెక్ట్‌కు నిధులు ప్రకటించడంతోపాటు, ఒకటి రెండు రోజుల్లో డబ్బులు వస్తాయని భూనిర్వాసితులు, అధికారులు ఆశలు పెట్టుకున్నారు. కానీ సమీక్ష సమావేశంలో కనీసం బస్వాపూర్ ప్రాజెక్ట్ గురించి పెద్దగా ప్రస్తావించలేదు. ఇప్పటికీ పది రోజులు అవుతున్నా పైసా విదిల్చలేదు. ఈ ప్రాజెక్ట్ పూర్తి కావడానికి సుమారు రూ. 500 కోట్లు కావాలి. ఇందులో రూ. 200 కోట్లు భూనిర్వాసితులు, మిగతావి అభివృద్ధి పనులకు అవసరం పడనున్నాయి. భూనిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ నిధులు చెల్లిస్తే తిమ్మాపూర్ గ్రామాన్ని ఖాళీ చేయనున్నారు. దీంతో రిజర్వాయర్‌ను నీటితో నింపే అవకాశం ఉంటుంది. దీని ద్వారా 2లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

బస్వాపూర్ ప్రస్తావనే లేదు..

బునాదిగాని, ధర్మారెడ్డిపల్లి, పిలాయిపల్లి ఇలా..

బునాదిగాని, ధర్మారెడ్డిపల్లి, పిలాయిపల్లి కాల్వలను అప్పుడే ఏదో చేసినంత బిల్డప్ సదరు సమావేశాల్లో కనిపించింది. సమీక్ష కంటే ముందు మంత్రులు, ఎమ్మెల్యేలు అనాజిపురం వద్ద ఉన్న బునాదిగాని కాల్వను సైతం పరిశీలించారు. బునాదిగానితోపాటు ధర్మారెడ్డి పల్లి, పిలాయిపల్లి కాల్వలకు వెంటనే నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలు కూడా ఇచ్చారు. కానీ పది రోజులైనా నిధులు దేవుడెరుగు కనీసం మంజూరు కూడా ఇవ్వలేదు. బునాదిగాని కాల్వకు రూ. 269.46 కోట్లు, పిలాయిపల్లికి రూ. 86.22 కోట్లు, ధర్మారెడ్డి పల్లికి రూ. 123.98 కోట్లు అవసరం పడతాయని నీటిపారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. కల్వర్టులు, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ ఆధునికీకరణతోపాటు భూసేకరణ చేపట్టాల్సి ఉంది. మూడు కాల్వలను ఆధునికరిస్తే మూసీ వృథా జలాలను ఉపయోగించుకోవచ్చు.

గంధమల్లకు అనుమతులే ఇయ్యలే..?

ఆలేరు నియోజకవర్గానికి సాగు, తాగు నీరు అందించేందుకు తుర్కపల్లి మండలంలోని గంధమల్ల చెరువును రిజర్వాయర్ చేయాలని గత ప్రభుత్వం ప్రతిపాదించింది. కానీ ముంపు సమస్య, భూసేకరణ అధికంగా ఉండటంతో 1.5 టీఎంసీలకు తగ్గిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆలేరుతో పాటు సిద్ధిపేట జిల్లాలో 63వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించాలని నిర్ణయించారు. దీని కోసం 1,144 ఎకరాలు భూసేకరణ, రూ.575.57 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేసి ప్రతిపాదనలు పంపించారు. గంధమల్ల రిజర్వాయర్ అప్పుడే కట్టినట్లు ఎమ్మెల్యేలు ధన్యవాదాలు కూడా చెప్పగా.. ఈ రిజర్వాయర్‌కు ఇప్పటి వరకు అసలు అనుమతులే రాలేదు. ఎలాంటి నిధులు మంజూరు కాలేదు.

ప్రతిపాదనలు పంపించాం..

గంధమల్ల రిజర్వాయర్‌తోపాటు బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వలకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. సర్కారు వద్ద పరిశీలన దశలో ఉన్నాయి. ఇప్పటి వరకు వీటికి ఎలాంటి మంజూరు అనుమతులు రాలేదు. బస్వాపూర్ రిజర్వాయర్‌కు కూడా నిధులు విడుదల కాలేదు. త్వరలోనే వస్తాయని భావిస్తున్నాం.

- శ్రీనివాస్, ఈఈ, నీటిపారుదల శాఖ

దేశానికి మోడల్‌గా తెలంగాణ పంచాయతీలు

- గ్రామాల్లో అభివృద్ధి పరుగులు భేష్
- 16వ ఆర్థిక సంఘం సభ్యుడు అజయ్ నారాయణ ఝా
- అనంతారం గ్రామం సందర్శించిన కేంద్ర, రాష్ట్ర అధికారులు

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 10 : గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలు బాగా జరుగుతున్నాయని 16వ ఆర్థిక సంఘం సభ్యుడు అజయ్ నారాయణ ఝా అన్నారు. భువనగిరి మండలం అనంతారం గ్రామాన్ని మంగళవారం 16వ ఆర్థిక సంఘం సభ్యులు అజయ్ నారాయణ ఝా, మనోజ్ పాండా, జాయింట్ సెక్రెటరీ కేకే మిశ్రా, జాయింట్ డైరెక్టర్ దావిందర్ చోడా, డిప్యూటీ డైరెక్టర్ అభిషేక్ నందన్, అసిస్టెంట్ డైరెక్టర్ భద్‌భేష్ హజారిక సందర్శించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల మహిళలు బోనాలతో వారికి ఘన స్వాగతం పలికారు. గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల మహిళలతో వారు ముచ్చటించారు. గ్రామ పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల అధ్యయనానికి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చామని, తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు మోడల్‌గా నిలిచిందని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా గ్రామ పంచాయతీలో పనులు బాగా జరుగుతున్నాయని, రాబోయే 16వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా ఇంకా అభివృద్ధి పనులు చేపట్టాలని చెప్పారు. దేశంలో ఆరోగ్యం, విద్యా రంగాల్లో సేవలు ఇంకా పెరుగాల్సి ఉందని, అంగన్‌వాడీల్లో మహిళల అభ్యున్నతి కోసం ఇంకా ఎక్కువ పనులు చేపట్టాల్సి ఉందని తెలిపారు. గ్రామ పంచాయతీలు స్వతంత్రంగా తమ నిర్ణయాలను తామే తీసుకునే స్థితికి రావాలన్నారు. కలెక్టర్ హనుమంతు కె.జెండగే మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం ద్వారా వచ్చిన నిధులను పారిశుధ్యం, తాగునీటికి వినియోగించామని తెలిపారు. ప్రైమరీ హెల్త్ సెంటర్లను అప్ గ్రేడ్ చేస్తున్నామని చెప్పారు.

సభలో సమాఖ్య మహిళలు ప్రభుత్వం అందిస్తున్న లబ్ధి ద్వారా తాము చేపట్టిన పనులను వివరించారు. అంతకుముందు పల్లె దవాఖానను ఆర్థిక సంఘం సభ్యులు సందర్శించి గ్రామీణులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. గ్రామంలో నిర్వహిస్తున్న స్వచ్ఛదనం- పచ్చదనం, పారిశుధ్యం కార్యక్రమాలపై ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్‌లో నిర్మించిన అదనపు తరగతులను పరిశీలించారు. పాఠశాల చిన్నారులతో ముచ్చటించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె. గంగాధర్, జిల్లా పరిషత్ ముఖ్య నిర్వహణ అధికారి శోభారాణి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి యశోద, జిల్లా పంచాయతీ అధికారి సునంద, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శామ్యూల్, జిల్లా విద్యాశాఖ అధికారి నరసింహ, డీఆర్డీఓ సురేశ్, అనంతారం మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



వలిగొండలో చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు

ధీర వనిత ఐలమ్మకు నివాళి

తెలంగాణ వీరనారి, ధీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని ఆమె పోరాట పటిమను కొనియాడారు. భావి తరాలకు ఆమె జీవితం స్ఫూర్తి దాయకమని తెలిపారు.

యాదాద్రి మెడికల్ కాలేజీకి అనుమతులు..!

- ఎల్ఓపీ ఇవ్వాలని ఎన్ఎంసీకి కేంద్రం ఆదేశం
- ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే 50 ఎంబీబీఎస్ సీట్లతో..
- ఈ వారంలో మెడికల్ కౌన్సెలింగ్ షురూ
- తాత్కాలికంగా భువనగిరి పాత కలెక్టరేట్‌లో ప్రారంభం
- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే కళాశాల మంజూరు

భువనగిరిలోని పాత కలెక్టరేట్‌లో నిర్వహించనున్న మెడికల్ కాలేజీ

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి మెడికల్ కాలేజీ ఏర్పాటుకు ఎట్టకేలకు అనుమతులు లభించాయి. కళాశాలకు లెటర్ ఆఫ్ పర్మిషన్(ఎల్ఓపీ) ఇవ్వాలని నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసీ)కు కేంద్రం వైద్యారోగ్య శాఖ ఆదేశాలు జారీ చేసింది. మంగళవారం లేదా బుధవారం ఎన్ఎంసీ కాలేజీకి ఎల్ఓపీ ఇవ్వనుంది. దీంతో ఈ ఏడాది నుంచే 50 ఎంబీబీఎస్ సీట్లతో కాలేజీ ప్రారంభం కానుంది. ఈ వారంలో మెడికల్ కౌన్సెలింగ్ జరుగనుందని ప్రిన్సిపాల్ రమేశ్‌రెడ్డి తెలిపారు.

ముచ్చటగా మూడోసారికి ఓకే..

యాదాద్రి మెడికల్ కాలేజీకి ఎల్ఓపీపై కొంత కాలంగా సందిగ్ధత నెలకొంది. మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలంటూ నేషనల్ మెడికల్ కమిషన్ అనుమతి ఉండాలి. అయితే మొదటి సారి ఎన్ఎంసీ బృందం స్వయంగా భువనగిరికి విచ్చేసి తనిఖీలు నిర్వహించింది. అవసరమైన నిబంధనలు పాటించలేదని, వసతులు లేవని ఎల్ఓపీని నిరాకరించింది. దీంతో ఫ్యాకల్టీ, స్టాఫ్ రిక్రూట్‌మెంట్, ఇతర సదుపాయాలను సమకూర్చి.. మరోసారి అప్పీల్‌కు వెళ్లారు. అనంతరం ఎన్ఎంసీ అధికారులు వర్చువల్‌గా తనిఖీలు చేపట్టారు. కానీ రెండోసారి కూడా ఎల్ఓపీకి ఎన్ఎంసీ నిరాకరించింది. కళాశాల అనుమతిని పునఃపరిశీలించాలని మూడోసారి అప్పీల్‌కు వెళ్లారు. స్వయంగా ఢిల్లీకి వెళ్లి ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని రకాల డాక్యుమెంట్లు మళ్లీ సమర్పించారు. అంతిమంగా ఎల్ఓపీ ఇవ్వాలని కేంద్రం ఎన్ఎంసీకి ఆదేశించడంతో మార్గం సుగమైంది.

తాత్కాలికంగా పాత కలెక్టరేట్ భవనంలోనే..

వాస్తవానికి యాదాద్రి మెడికల్ కాలేజీలో మొదట వంద సీట్లతో జీఓ ఇచ్చారు. ఆ తర్వాత సరైన సదుపాయాలు లేవని 50 సీట్లకు కుదించారు. అంతే కాకుండా అనుబంధ ఆస్పత్రికి 300 పడకలకు బదులు 220 పడకలకు కుదించారు. అయితే యాదగిరిగుట్టలో ఇంకా కాలేజీ భవన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో భువనగిరిలోని పాత కలెక్టరేట్ భవనంలో మెడికల్ కాలేజీ ప్రారంభించాలని నిర్ణయించారు. ఇప్పటికే భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. కళాశాల అవసరానికి అనుగుణంగా కొన్ని మార్పులు చేశారు.

బీఆర్ఎస్ హయాంలోనే మంజూరు..

మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా నాడు స్థానిక ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి కృషితో యాదగిరిగుట్టకు కళాశాల మంజూరు చేశారు. తిరుపతి తరహాలో గుట్టలో మెడికల్ కాలేజీ ఉండాలని భావించారు. ఇందులో భాగంగా గతేడాది జూన్ 5న యాదగిరిగుట్టకు మెడికల్ కాలేజీని మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాలేజీ నిర్మాణానికి రూ. 183 కోట్లు కేటాయించింది. 433 పోస్టులను కూడా క్రియేట్ చేస్తూ జీఓ రిలీజ్ చేసింది. ఆ తర్వాత శ్రీలక్ష్మీనరసింహస్వామి మెడికల్ కాలేజీగా నామకరణం కూడా చేసింది.

26 గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

నందికొండ, సెప్టెంబర్ 10 : శ్రీశైలం నుంచి పెద్ద ఎత్తున వరద వస్తుండడంతో మంగళవారం నాగార్జున సాగర్ డ్యామ్ 26 క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. శ్రీశైలం నుంచి 2,50,629 క్యూసెక్కుల వరద సాగర్‌కు వస్తుండగా అదే స్థాయిలో ఔట్‌ఫ్లో కొనసాగుతున్నది.

26 క్రస్ట్ గేట్ల ద్వారా కొనసాగుతున్న సాగర్ డ్యామ్ నీటి విడుదల

అంతులేని కథలా.. రుణమాఫీ

మూడో విడుత తర్వాత ఒక్కరికీ అదనంగా రుణమాఫీ కాలె

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నిత్యం వ్యవసాయ పాలాల్లో ఉండాల్సిన రైతులు అంతకుమించిన సమయాన్ని బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరగడానికే వెచ్చించాల్సి వస్తున్నది. అందుకు కారణం అంతులేకుండా సాగుతున్న రుణమాఫీ కథనే. ప్రభుత్వం ప్రకటించిన మూడు విడుతల రుణమాఫీలో ఉమ్మడి జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య 60శాతానికి మించలేదు. దీంతో మిగతా 40శాతానికి పైగా రైతులు రుణమాఫీ కోసం చెప్పులరిగేలా తిరుగుతున్నారు. అన్ని అర్హతలున్నా రుణమాఫీ కాకపోవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున రైతులు ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. అయినా ప్రభుత్వం వైపు నుంచి మూడో విడుత రుణమాఫీ తర్వాత కొత్తగా ఒక్క రైతుకు కూడా రుణమాఫీ అయిన దాఖలాలు లేకపోవడం గమనార్హం.

– నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్10(నమస్తే తెలంగాణ)

బ్యాంకులు, అధికారుల చుట్టూ రైతుల చక్కర్లు

రేషన్‌కార్డు లేని వారి సర్వే ఇంకా ఎన్ని రోజులో..

మిగతా కారణాలతో కాని వారిది తేలేది ఎన్నడో?

రైతుల ప్రశ్నలకు సమాధానం చెప్పే నాథుడే కరువు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మూడు విడుతల్లో కలిపి 3.39లక్షల మంది రైతులకే రుణమాఫీ జరిగింది. జిల్లాలో కనీసం ఆరు లక్షల మంది రైతులు రుణమాఫీకి అర్హులు ఉంటారని రైతు సంఘాల అంచనా. ఇంకో రెండున్నర లక్షల మంది రైతులు రుణమాఫీకి దూరంగా ఉన్నారు. వీరంతా రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. రుణమాఫీ కాని వారిలో రేషన్‌కార్డు లేని వాళ్లు, ఒక కుటుంబంలో ఉన్న వ్యక్తులకు రెండు లక్షలకు మించి రుణం ఉన్నవాళ్లు, ఆధార్, బ్యాంకు అకౌంట్, పట్టాదారు పాసుపుస్తకం నంబర్లతో పాటు పేర్లు సరిపోలకపోవడం లాంటి వాళ్లు ఉన్నారు. వీరంతా ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఆందోళనలు, నిరసనలకు దిగారు. పలు వేదికల మీదుగా ప్రభుత్వాన్ని నిలదీశారు. దీంతో ప్రభుత్వం రైతుల ఆగ్రహాన్ని చల్లార్చడానికి పలు ఎత్తుగడలతో ముందుకు సాగుతున్నది. రేషన్‌కార్డు లేని రైతుల సర్వే ఓ వైపు, తప్పులను సరిదిద్దే కార్యక్రమాన్ని మరోవైపు నడిపిస్తున్నట్లుగా ప్రకటించింది. కానీ వీటికి నిర్దిష్టమైన గడువు ఏదీ పెట్టలేదు. దీంతో ఎంత వీలైతే అంత సాగదీయడమే లక్ష్యమన్నట్లుగా ప్రభుత్వ వ్యవహార శైలి కనిపిస్తున్నది. తిరిగి తిరిగి విసిగి చివరకు రైతులే రుణమాఫీపై ఆశలు వదులుకునేలా చేయడమే ప్రభుత్వ వ్యూహమన్నట్లుగా తెలుస్తున్నది.



రేషన్‌కార్డు సర్వే పేరుతో..

నిజానికి రుణమాఫీ కాకపోవడానికి 31 కారణాలు ఉన్నాయని స్వయంగా రాష్ట్ర వ్యవసాయ శాఖనే గుర్తించి ప్రభుత్వానికి పంపింది. ఆ లెక్కన 31 అంశాలపై క్లారిటీ ఇస్తూ ఆ కారణాలతో రుణమాఫీ కాని రైతుల వివరాలను ప్రభుత్వం సేకరించాల్సి ఉంది. ఇదే సమయంలో రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించేందుకు ఇంటింటా సర్వే చేస్తామని ప్రకటించింది. ప్రభుత్వం చెప్పిన దాని ప్రకారం చూస్తే రుణమాఫీ కాని అందరి రైతులకు సంబంధించి సర్వే జరగాలి. కానీ క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. రేషన్‌కార్డు లేక మాఫీ కాని రైతుల వివరాలను సేకరించే బాధ్యత వ్యవసాయ శాఖ తీసుకుంది. దీని ప్రకారం కూడా వ్యవసాయ అధికారులు రైతు గ్రామాల వారీగా తేదీలు ఇచ్చి కొనసాగిస్తున్నారు. కానీ ఈ సర్వే పూర్తికి ప్రభుత్వం నిర్దిష్టమైన గడువేదీ పెట్టలేదు. దీంతో ఇది నత్తనడకన సాగుతున్నది. నల్లగొండ జిల్లానే పరిశీలిస్తే వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం 44వేల మంది రైతులు ఉన్నారు. కానీ నేటికీ 20వేల మంది రైతుల వివరాలను మాత్రమే సేకరించారు. అంటే ఇంకా సగానికి పైగా రైతుల వివరాలు సేకరించి వారితో సెల్ఫీ ఫోటో దిగి అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఇది ఎప్పటివరకు పూర్తవుతుందనేదానికి క్లారిటీ లేదు.

మిగతా వారి పరిస్థితేంటో...?

ప్రస్తుతం కుటుంబ నిర్ధారణ కోసం రేషన్‌కార్డు లేని వారి వివరాల సేకరణ మాత్రమే జరుగుతుంది. మిగిలిన 30 కారణాలతో రుణమాఫీ కాని రైతుల పరిస్థితి ఏంటో తేలడం లేదు. అయితే ఇందులోనూ ఆధార్, బ్యాంకు, పట్టాదారు పాసు పుస్తకం, లోన్ అకౌంట్ నంబర్లలో తప్పులు లేదా పేర్లు సరిపోలకపోవడం వంటి తప్పుల సవరణ బాధ్యతలను బ్యాంకు మేనేజర్లకు అప్పజెప్పారు. వారినే నోడల్ అధికారులుగా ప్రకటిస్తూ వారే వీటిని సరి చేయాలని ఆదేశించారు. అయితే ఇది కూడా నత్తనడకన సాగుతున్నది. బ్యాంకర్లు వాళ్ల రోజు వారీ బ్యాంకు పనులతో రుణమాఫీ అర్జీలపై పెద్దగా దృష్టి సారించడం లేదు. పైగా దీనికి కూడా ఎలాంటి నిర్దిష్ట గడువు లేకపోవడంతో రేపుమాపు చుద్దామంటూ రైతులను తిప్పుతున్నారు. ఇక డీసీసీబీ బ్యాంకుల్లో సైతం 40శాతానికి మించి మాఫీ కాలేదు. ఇక్కడ కూడా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో సదరు రైతులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయక తప్పడం లేదు. దీంతో ఉమ్మడి జిల్లాలో రుణమాఫీ కాని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రుణమాఫీ కాకపోవడంతో జిల్లా స్థాయిలో కలెక్టర్ నిర్వహించే ప్రజావాణి మొదలు క్షేత్రస్థాయి వ్యవసాయ అధికారి వరకు దరఖాస్తులు చేస్తూ దండం పెడుతున్నారు.

చిత్తశుద్ధి కరువు

ప్రభుత్వానికి రుణమాఫీ విషయంలో చిత్తశుద్ధి లేకపోవడంతోనే రైతులు ఇబ్బందికి గురవుతున్నారన్నది నిజం. లక్షలాది మందిలో నెలకొన్న ఆందోళనకు చెక్ పెట్టాలని ఉద్దేశం ఉంటే జిల్లాల వారీగా మంత్రులు సమీక్ష చేయవచ్చు. కానీ అలాంటి భరోసా ఏదీ రైతులకు ఇవ్వడంలో ఉమ్మడి జిల్లా మంత్రులు విఫలమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నేటికీ రుణమాఫీ కోసం నిత్యం ఎక్కడో ఓ చోట రైతుల ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఎన్నికల్లో ప్రకటించిన విధంగా అర్హులైన రైతులందరి మాఫీ కోసం నేటికీ పోరాటం చేస్తూనే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ఉమ్మడి జిల్లా మంత్రులు ఒక సారి అధికార యంత్రాంగంతో సమావేశం నిర్వహించి సమీక్ష చేస్తే బాగుండేదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అసలు రుణమాఫీ ఇంకా ఎంతమందికి కావాల్సింది? ఏ కారణాలతో కాలేదు? ఇందులో మాఫీకి ఎంత మంది అర్హులు? లోపాలు బ్యాంకుల వద్దనా లేక వ్యవసాయ శాఖ వద్ద ఉన్నాయా? ఇలాంటి వాటిపై సమీక్షించి నిర్దిష్ట గడువు విధిస్తే అంతులేని రుణమాఫీ కథకు ముగింపు పలుకవచ్చని సూచనలు వస్తున్నాయి. ఇవన్నీ ఎలా ఉన్నా రుణమాఫీ చేయాలని ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇవన్నీ ఉండేవేమో, కానీ అలాంటి పరిస్థితి క్షేత్రస్థాయిలో కనిపించడం లేదన్నది మాత్రం వాస్తవం.